# 'న్యాయ స్థానం'లో

-శ్రీరాగి

జిల్లాకోర్టు సాక్షిబోనులో సుబ్బారావు నిల్చొన్నాడు. కోర్టు అమీను ప్రమాణం చేయించాడు.

"దేవుని సాక్షిగా నేను అంతా నిజమే చెప్తాను. అబద్ధం చెప్పను."

బోనులో ఓ కుర్చీ, ముందు మేజాబల్లా ఉన్నాయి.

ప్రతివాది లాయరు...

ఏమి పిచ్చి ప్రశ్నలు అడుగుతాడో? అనుకున్నాడు సుబ్బారావు.

తనెలా సమాధానం చెప్తాడో?

"చూడండి... మీకిచ్చిన పట్టాకాగితంలో మీరు ఆరు నెలల గడువులో ఇల్లుకట్టాలని ఉంది. చూశారా?"

లాయరు ప్రశ్న.

నిజమే... ప... ఆర్డరులో అక్షర కండిషన్లు ఇచ్చారు. తనెప్పుడో ఓసారి ఏదో వంక చూసినమాట నిజమే. లాయరు చెప్పిన కండిషనుకూడా దాంట్లో ఉండే ఉంటుంది.

తనేం సమాధానం చెప్పాలి? ఆలోచించి చెప్పటానికి, కోర్టు రూల్సు ఒప్పుకోవు...

ఏదో ఒకటి. 'అవును' అనో 'కాదు' అనో చెప్పాలి.

"అవును..."

"మరి మీరు ఆరునెలల్లో ఇల్లు కట్టారా?"

"నేను కట్టలేదు. కాని ఇళ్ళ పట్టా ఇచ్చిన ఎనిమిది వందల ప్రభుత్వోద్యోగుల్లో చాలామంది... ఇప్పటికీ ఇళ్ళు కట్టలేదు."

"అది మీ కనవసరం... మీరు కట్టారా... లేదా?"

ప్రతివాది తాలూకు గర్జన!

సుబ్బారావు... మనసులోనే తిట్టుకున్నాడు.

లాయర్లు!

"కట్టలేదు..."

"1983లో మీరు ప్రతివాదికి... ఇల్లు కట్టిన విషయంలో... లాయరు నోటీసు ఇచ్చారు కదూ?"

1983లో తనతో పనిచేసిన చలపతి అనే ఉద్యోగి తన స్థలాన్ని కొనటానికి... ఓ పార్టీని పట్టుకొచ్చాడు.

కలెక్టరు తనకు ఇంటి పట్టా ఇచ్చింది 1970లో...

తను ఇంత వరకూ ఆ స్థలంలో ఇల్లు కట్టలేదు. కట్టటానికి డబ్బు ఉండేగా? బడితే మీద ఊళ్ళు తిరుగుతున్నాడు.

పార్టీతో బేరం పెట్టాడు.

ఏదో ఒక రేటుకు బేరం కుదిరింది... కొన్నాయన అడ్వాన్సు ఇచ్చి... దస్తావేజు వ్రాయించుకున్నాడు. రిజిస్ట్రారు ఆఫీసులో డబ్బు పెట్టియగానే స్థలం స్వాధీనం చెయ్యాలని... రెండు మూడు నెలల్లో మిగతా డబ్బు ఇస్తానన్నాడు.

తను ఒప్పుకున్నాడు.

చలపతి... పార్టీని... అవతలకు పంపించాడు.

చలపతి చెయ్యి చాచాడు.

ఇందుకోసమన్నమాట ఏదొచ్చింది. స్వామి లాభంలో స్వలాభం!

ఓ వంద రూపాయల నోటు వాడిచేతిలో ఉంచాను.

"మిగతాది మీ పార్టీ మిగతా డబ్బు ఇచ్చినప్పుడు."

పార్టీ... చలపతి... వెళ్ళిపోయారు.

మూడు వారాల తర్వాత ఉత్తరం వచ్చింది.

"సుబ్బారావు గారూ...

నమస్కారం.

మీ స్థలంలో ఎవరో రాళ్ళు తోలారు. ఇల్లు కట్టుకోటానికి. మేము వెళ్ళి అటకాయించాము. తహసీల్దారు పట్టా చూపించారు. 1979లో గవర్నమెంటుకు మార్కెటు రేటు చెల్లిస్తే అతనికి తహసీల్దారు పట్టా ఇచ్చారట.

మా తాలుకా ఆఫీసులో కనుక్కున్నాం. మీ పట్టా క్యాన్సిలు కాలేదు. అది దొంగపట్టా...ఎక్కడో మోసం జరిగింది.

లాయరు చేత స్థలం ఖాళీ చెయ్యమని నోటీసు ఇప్పించాం.

ఆయన సమాధానం ఇచ్చాడు. తనకు — స్థలానికి తహసీల్దారు పట్టా ఇచ్చారని.

మీరొప్పుకొంటే మీ పేరుమీద కేసు దాఖలు చేస్తాం.



ఖర్చులన్నీ పెట్టి పెట్టుకుంటాడు.

మీరు వచ్చి సాక్ష్యం చెప్పాలి.

మీ మిగతా డబ్బు కేసు గెల్చిన తర్వాత ఇస్తాడు పార్టీ!

మరి కంప్లెయింటును మీ సంతకానికి పంపమంటారా?

వెంటనే వ్రాయండి.

ఉత్తరం చదివి, వివరించాడు శ్రీమతికి సుబ్బారావు.

"ఎవరో వ్రాస్తారు... మన స్థలం ఆక్రమించాడన్న మాట! అంది శ్రీమతి కోపంగా.

"ఇప్పుడేం చేయటం" మదన పడ్డాడు సుబ్బారావు!

"కోర్టులో కేసు వేస్తే మీరెవ్వళ్ళు ఆ ఊరు చుట్టూ తిరగాలో? మన ఇబ్బందులు చాలక పైగా ఇదో కోర్టు కేసా?" అంది శ్రీమతి.

"పైగా వాడు మిగతా డబ్బు ఇవ్వడట! ఇప్పుడు కేసు ఎన్ని సంవత్సరాలు నడుస్తుందో...?" సుబ్బారావు అన్నాడు.

"అప్పుడు ఈ స్థలం ధర పెరిగినా... ఈ మహాను భావుడు... ఇప్పుడు కొన్న డబ్బే ఇస్తానంటాడేమో..." శ్రీమతి తన సందేహం బయట పెట్టింది.

"అది మనకు నష్టంగాదూ?" సుబ్బారావు అన్నాడు.

"మీరేం చేస్తారు?" శ్రీమతి అంది.

"స్థలం అమ్మకం వదులుకొందాం. వాళ్ళ అడ్వాన్సు వాళ్ళకిచ్చేద్దాం!" అన్నాడు సుబ్బారావు.

"అదేమంచిది. అలాగే చేయండి ప్రస్తుతానికి. తర్వాత కేసు విషయం ఆలోచిద్దాం..." సలహా ఇచ్చింది శ్రీమతి.

అనుకున్నట్టుగానే చలపతికి... సుబ్బారావు ఉత్తరం వ్రాశాడు.

"నేనిప్పుడు కేసులో ఇరుక్కోటానికి పరిస్థితులు అనుకూలంగా లేవు... అతన్నే వచ్చి అడ్వాన్సు తీసుకు పొమ్మను. నా ఇష్టమొచ్చినప్పుడు కేసు నడిపిస్తాను."

అలా 83లో... తీసుకొన్న అడ్వాన్సు తిరిగి ఇచ్చేశాడు. 91లో కేసు వేశాడు.

ఎన్నో తర్జన భర్జనలైన తర్వాత తన పరిస్థితి మెరుగు కావటంతో ఆ నోటీసు గురించే ఇప్పుడు ప్రతివాది లాయరు అడగటం.

ఆ వ్యవహారం... ఈ నోటీసు... తన అనుమతి తీసుకొని ఇచ్చింది కాదు.

ముందే తమ లాయరు... ఆ విషయం... అడిగితే తెలీదని చెప్పమన్నాడు.

"నేను ఏ విధమైన నోటీసు ఇవ్వలేదు. ఆ విషయం నాకు తెలీదు." సుబ్బారావు సమాధానం.

"మీరు ప్రతివాది ఇళ్ళు కట్టినట్టు ఎప్పుడు తెలుసుకున్నారు.

"1985లో..."

"మీరు అప్పుడు వచ్చి ప్రతివాదిని...ఇల్లు ఖాళీ చెయ్యమని అడిగారు కదా"

"అవును..."

"అప్పుడు మీరొక్కరే వచ్చారా?"

అసలు... అతనిని ఇల్లు ఖాళీచెయ్యమని అడగనే లేదు. అలా చెప్పందే కేసే లేదన్నాడు తమ లాయరు! లాండు 'గ్రాబింగ్' క్రిందికి కేసు వెయ్యాలంటే అలా చెప్పేనే కేసట!

తనకు తహసీల్దారు ఇచ్చిన పట్టా చూపించాడు ప్రతివాది. తనేం చెప్పాలి?

"అవును..." తన నోరు చెప్పింది.

"ఆయన మీకు తన పట్టా చూపించాడా?"

ఇక్కడ పట్టా చూపించినా... ఆ విషయం ఒప్పుకోవలసిన పని లేదు... లాయరు ముందే చెప్పాడు.

సుబ్బారావు నోట్లో ఏ శని ఉందో?

"చూపించాడు... కాని అది బోగస్ పట్టా."

"అది మీరు చెప్పకూడదు." ప్రతివాది లాయర్ తన నోటికి తాళం వేశాడు.

ఇలాగే ఏవో ప్రశ్నలమీద ప్రశ్నలు అడగటం... సుబ్బారావు తనకు తోచినట్లుగా చెప్పటం జరిగింది.

జడ్జీగారు తన సాక్ష్యాన్ని ఎప్పటికప్పుడూ కోర్టు టైపిస్టు చేత టైపు మిషను మీద ఆంగ్లంలో టైపు చేయించాడు.

క్రాస్ ఎగ్జామినేషన్ అయిపోగానే... సాక్ష్యం బోను నుంచి బయటపడి, సింహం నోటిలో నుంచి బయట పడ్డట్లుగా అనుభూతి పొందాడు సుబ్బారావు.

ఆ సాక్ష్యం కాగితాలమీద, కోర్టు అమీను తన సంతకం తీసుకొన్నాడు. తను చూసే సంతకం చేశాడు.

తర్వాత తన లాయరు అన్నాడు.

"మీరు సరిగా సమాధానాలు చెప్పలేదు. అన్నీ మనకు ప్రతికూలంగా చెప్పారు. క్రిందటిసారి బాగా దబాయించి చెప్పారు... ఆ స్థలం మీదేనని."

మూడు నెలల క్రితం, ప్రతివాద్ది లాయరు తనను పది నిమిషాల సేపు క్రాస్ ఎగ్జామినేషను చేశాడు. క్రిందటి రోజు జరగవలసిన కేసు... ఆ రోజు సాయంకాలం 4. 45 గంటలకు జరగలేదు.

"మిగతాది రేపు..." అన్నాడు ప్రతివాది లాయరు. తనకు ఓపిక నశించి... వాయిదా అడిగాడు.

వాల్గు వాయిదాలకూ తను హాజరైనా ప్రతివాది హాజరు కాకపోవటంతో ప్రతివాది లాయరు తన క్రాస్ ఎగ్జామినేషను పూర్తిచేయ్యలేదు. ప్రతివాదికి జబ్బు చేసింది అంటాడు లాయరు.

ప్రతిసారీ ఆ ఊరు వెళ్ళినప్పుడు నాలుగు వందలు ఖర్చు అయ్యేది. తనకు విసుగొచ్చింది.

"అయితే మన కేసు పోతుందంటారా?"

"ఇంత మాత్రానికేం కాదు. తర్వాత చాలా తతంగం ఉంది. ప్రతివాదిని... నేను క్రాస్ చెయ్యాలి. దొంగపట్టాకు అధికార్లకు ఎంత ముడుపు చెల్లించాడో అడుగుతాను.

అవసరమయితే స్థలం గుర్తింపుకి... లాయర్ల కమీషన్ ఏర్పాటు చేయిస్తాను..."

"ఇప్పటికి వాల్గు సంవత్సరాల నుంచి తిరుగుతున్నాను."

"కోర్టు కేసు అంటే ఓ పట్టాన తెమలదు... ఓ సారి ప్రతివాది హాజరు కాకపోవచ్చు. మరోసారి మీరు హాజరు కాకపోవచ్చు. ఒక్కోసారి లాయర్లు హాజరు కాలేక పోవచ్చు. ఓసారి జడ్జీగారే సెలవు పెట్టవచ్చు. అలాంటప్పుడు కేసు వాయిదా పడకతప్పదు కదా..."

తన లాయరు చెప్పుకొచ్చాడు.

"ఇంతకీ మనం గెలుస్తామా?" సుబ్బారావు అడిగాడు.

"మన ప్లీస్ పాయింట్లు మనకున్నాయి. ఆ తహసీల్దారుకు 1979లో మీ ప్రతివాదికి పట్టా ఇవ్వటానికి... అధికారం లేదు. కారణం 1979లో మీకిచ్చిన ప్లాటు మున్సిపాలిటీలో కలిసి పోయింది. అలా అని గెజిట్ ప్రకటన ఉంది."

"అది సరే! నేను ఆరునెలల్లో ఇల్లు కట్టలేదంటాడు వాళ్ళ లాయరు."

"మీరే కాదు. ఇప్పటికీ ఇల్లు కట్టని వాళ్ళున్నారు గదా! జిల్లాలు తిరుగుతూంటే ఎలా కడ్తారు. అదంతా నా ఆర్గ్యుమెంటులో వాదిస్తాను... మీకేం భయం లేదు..."

ధైర్యం చెప్పాడు తన లాయరు.

"మళ్ళీ వాయిదా ఎప్పుడు?"

"జడ్జీగారు చెప్పారు గదా! సంక్రాంతి సెలవుల తర్వాత జనవరికి."

"నేను రావాలా?"

"అక్కర లేదు. నేను చూసుకుంటాను. అవసరమైనప్పుడు నేనే వ్రాస్తాను. మీకు మీరు కొంచెం ఓపిక పట్టాలి. ఆరునెలల్లో కేసు పూర్తి చెయ్యటానికి ప్రయత్నిస్తాను."

"మరి సెలవ్!"

"మంచిది."

సుబ్బారావు ముఖం వేలాడేసుకుని తను ఉంటోన్న ఊరుకి వచ్చేశాడు. ఇక్కడ తన పిల్లల ఉద్యోగాలు చేస్తున్నారు కదా!

"ఏమైంది కేసు!" అడిగింది శ్రీమతి.

"నా సాక్ష్యం మీద ప్రతివాది లాయరు క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తయింది!" అన్నాడు సుబ్బారావు.

"ఎప్పటికి తెములుతుందీ కేసు?"

"ఆ భగవంతుడికే తెలుసు!" అంటూ సుబ్బారావు ఆకాశం కేసి చూపించాడు.

కె.పి.ఎస్. సుబ్రమణ్యేశ్వరరావు,
18/85, కమలా నగర్,
'బి' క్యాంప్,
కర్నూల్ - 518 008.